క్లుప్తంగా

వర్ధమాన్‌లో 'యాంత్రిక్ 23 టెక్నికల్ ఫెస్ట్'



స్కిల్‌హబ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల 'యాంత్రిక్ 23 టెక్నికల్ ఫెస్ట్' ప్రారంభమైంది. యాంత్రిక్ పేరుతో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో నాల్గో సంవత్సరం కళాశాల విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా లేజర్ వుడ్ సొల్యూషన్స్ సీఈఓ మనోజ్‌కుమా ర్ హాజరయ్యారు. ఎలక్ట్రికల్ టూ వీలర్, డ్రోన్స్, త్రీడీ ప్రింటింగ్ కార్యశాలను ప్రారంభించారు. మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీ.రవీంద్ర, మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు సుస్థిరాభివృద్ధి నవకల్పనలపై సదస్సు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు నవకల్పనలతో కూడిన ఎంటర్ ప్రెన్యూనరల్ మార్గాలు అనే అంశంపై ఒక రోజు సదస్సును ఈనెల 29న నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆధునిక సాంకేతికతను ప్రదర్శించేందుకు ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఔత్సాహిక యువ ప్రారిశ్రామికవేత్తలు, స్టార్టప్ కంపెనీలు, తమ అనుభవాలను పంచుకోనున్నారు.

ఘనంగా మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: మధురానగర్‌లోని ఎదురు గడ్డ మైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల సమక్షం, ఆలయ కమిటీ, స్థానికుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మైసమ్మ అమ్మవారికి 20 లీటర్ల పాలు, 10 లీటర్ల పెరుగు, 5 లీటర్ల తేనె, 3 కేజీల చక్కెర, 2 కేజీల కుంకుమ, 2 కేజీల పసుపు, 2 కేజీల గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాయదుర్గం, మధురానగర్, ఖాజాగూడ, ప్రశాంత్‌హిల్స్ కాలనీల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో నక్షత్ర హారతితో వార్షికోత్సవాలు ముగిశాయి.

28 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు

రాజేంద్రనగర్: ఎండు గంజాయితో పాటు మూడు లీటర్ల లిక్విడ్ మత్తు మందును తీసుకువచ్చిన ఇద్దరు యువకులను రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 28 కిలోల ఎండు గంజాయి, మూడు లీటర్ల ఆయిల్, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో సీపీ స్టీఫెన్ రవీంద్ర సోమవారం నిందితుల వివరాలను వెల్లడించారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మల్లంపేట్ గ్రామానికి చెందిన గొల్లి కుమారస్వామి, జొన్న స్వామి స్నేహితులు. ఐటీఐ వరకు చదువుకున్న వీరు మొదట వివిధ ప్రాంతాల్లో కూలి పనులు చేశారు. ఈ క్రమంలో డబ్బులు సరిపోకపోవడంతో గంజాయి రవాణాకు సిద్ధమయ్యారు. లంబసింగి మండలం లక్ష్మీపురంకు చెందిన లక్ష్మణ్‌రావును కలిశారు. 2022 జూన్‌లో 108 కిలోల గంజాయిని తరలిస్తూ పోలీసులకు చిక్కారు. రాజమండ్రి జైలు నుంచి తొమ్మిది నెలల క్రితం విడుదలయ్యారు. గత వారం తిరిగి లక్ష్మణ్‌రావును కలిశారు. హైదరాబాద్‌కు ఎండు గంజాయితో పాటు హాష్‌ ఆయిల్‌ను సరఫరా చేయాలని లక్ష్మణ్‌రావు సూచించారు. బస్సులో వెళ్తే పోలీసుల తనిఖీలు ఉండవని 28 కిలోల గంజాయిని ఏడు బండిళ్లుగా ప్యాక్‌చేసి సోమవారం ఉదయం బయలుదేరారు. ఆరాంఘర్ ప్రాంతానికి చేరగానే గంజాయిని ఎవరికి ఇవ్వాలో తెలుపుతానని లక్ష్మణ్‌రావు చెప్పాడు. ఆరాంఘర్ చౌరస్తాకు చేరుకున్న ఇరువురు లక్ష్మణ్‌రావు ఫోన్ కోసం ఎదురు చూస్తుండగా ఎస్ఓటీ, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా నిందితులను పట్టుకొని సోదా చేశారు. సోదాలో 28 కిలోల గంజాయి, మూడు లీటర్ల ఆయిల్‌తో పాటు రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



కేసు వివరాలను తెలుపుతున్న స్టీఫెన్ రవీంద్ర

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: రాష్ట్రంలో పేదలందరి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో పనిచేస్తోందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం గండిపేట్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద 95 మందికి షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. 55 మందికి 58 జీవో ప్రకారం.. స్థలాల క్రమబద్ధీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదింటి పిల్లల వివాహాలకు అప్పులు చేయొద్దనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారికి వెంటనే రూ.1,01,016లను అందజేస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రతి ఒక్కరూ చిరునవ్వులతో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

- బంగారు తెలంగాణ అంటే ఇదేనని దేశ వ్యాప్తంగా చాటి చెప్పడంతో పాటు తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు సీఎం కేసీఆర్ సిద్ధమయ్యారన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గృహాలు కట్టుకున్న పేదలకు 58 జీవో ప్రకారం ఉచితంగానే క్రమబద్ధీకరణ చేయడం శుభ పరిణామన్నారు.
- ఏప్రిల్ 2022 వరకు వచ్చిన ఇలాంటి నిర్మాణాలను ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ రాజశేఖర్, నయాబ్ తహసీల్దార్ జంగయ్య, గిర్దవరిలు మహిపాల్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీల అధ్యక్షులు ఆర్. నర్సింహ, జి.సురేష్‌గౌడ్, శ్రీరాములు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో తెలంగాణే నెంబర్ వన్

బండ్లగూడ: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గండిపేట మండల కార్యాలయంలో ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నామన్నారు. దేశానికే తెలంగాణను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా పేదింటి ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక సాయం అందుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల రెవెన్యూ అధికారి రాజశేఖర్, కార్పొరేటర్లు అస్లాం బిన్ అబ్దుల్లా, సాగర్‌గౌడ్, రాము, కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, నాయకులు పాపయ్యయాదవ్, సయ్యద్ ఖాజా, రజాక్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

- నాల్గో వార్డు కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ హెచ్చరిక
- రంజాన్ ప్రారంభమైనా మౌలిక వసతులు లేవు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ తదితరులు

శంషాబాద్: బస్తీల్లోని మౌలిక వసతుల కల్పనపై స్థానిక ప్రజా ప్రతినిధిగా 6 నెలలుగా మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని నాల్గో వార్డు కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి దీపాలు వెలగక నెలలు గడుస్తున్నా వాటికి మరమ్మతులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లుకు వినతి పత్రం అందజేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

- గతంలో ప్రతీ పండగకు ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించి చర్యలు తీసుకునే వారని మున్సిపాలిటీ ఏర్పాటైన తర్వాత ఆ విధానాన్ని పక్కన పెట్టేశారన్నారు.
- రంజాన్ మాసం సందర్భంగా బస్తీలో కనీస మౌలిక వసతులు కల్పించడంపై అధికారులు దృష్టి సారించలేదన్నారు.
- మున్సిపాలిటీ కార్యాలయం కేవలం కొందరి ఇష్టారాజ్యంగా కొనసాగుతుందని మండిపడ్డారు.
- మౌలిక వసతుల కల్పనలో కూడా వివక్షత కొనసాగుతుందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో కూడా అదే ధోరణి కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను కేవలం మూడు రోజుల వ్యవధిలో పరిష్కరించేందుకు మున్సిపల్ కమిషనర్ హామి ఇచ్చారన్నారు.
- పరిష్కారం కాకపోతే నాల్గో వార్డుతో పాటు సమస్యలు ఎదుర్కొంటున్న బస్తీల నుంచి పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు తాజ్‌బాబా తదితరులున్నారు.

'కంటి వెలుగు'పై ఇంటింటి ప్రచారం



నార్సింగిలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్, వైద్య సిబ్బంది

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో ఈ నెల 28 నుంచి నిర్వహించే 'కంటివెలుగు' వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ ఉషారాణి కోరారు. సోమవారం ఆమె తన వార్డులో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కంటి వెలుగు పథకం వల్ల కలిగే లాభాలను వివరించారు. కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిరుధాన్యాల వంటల పోటీలు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకంలో భాగంగా అంతర్జాతీయ చిరుధ్యానాల సంవత్సరం సందర్భంగా విద్యార్థులకు చిరుధాన్యాలపై వంటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వంటకాలలో భాగంగా రాగి బొబ్బట్లు, రాగిలడ్డు, సర్వపిండి వంటి వంటకాలను చేసి ప్రదర్శించారు. ఆహారంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అధ్యాపకులు వివరించారు. విశ్వవిద్యాలయం డీన్ సత్యనారాయణ, నరేంద్రరెడ్డి అధికారులు పాల్గొన్నారు.



వంటలను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థులు ఇష్టంగా చదవాలి



కెరియర్ గైడెన్స్ పుస్తకాలను అందుకున్న విద్యార్థులు

రాజేంద్రనగర్: విద్యార్థులు ఇష్టంగా చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డిలు అన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడి లేకుండా చక్కగా చదువుకోవాలన్నారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సీనియర్ నాయకులు పచ్చ శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల్లో రాణించాలి..

మణికొండ: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు రాణించి ఉన్నత మార్కులు సాధించాలని ఐడీబీఐ కాపిటల్ ఎండీ, సీఈఓ కమల్‌కాంత్ ఉపాధ్యాయ అన్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఆయన తమ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కేరియర్ గైడెన్స్ పుస్తకాలను ఆవిష్కరించి అందజేశారు. 100 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకాలను అందించి వారికి అధిక మార్కులు వచ్చేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నామని పేద విద్యార్థుల చదువులకు మరిన్ని సేవలు అందిస్తామన్నారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి నగేష్, శ్రీనివాస్, నిఖిల్, వరప్రసాద్, చరణ్, రెడ్యానాయక్, విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు నిరంజన్, శ్యామ్‌సుందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



సామగ్రిని అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ప్రజా శ్రేయస్సు కోసం రోజూ పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి మున్సిపాలిటీ తరపున పూర్తి స్థాయిలో కృషి చేస్తామని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు 5 నెలల సబ్బులు, చీరలు, నూనెలు తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనిచేసిన అనంతరం కార్మికులు పరిశుభ్రంగా ఉండటం ఎంతో ముఖ్యమని వారి ఆరోగ్యాలు దెబ్బతినకుండా అవసరమైన సామాగ్రిని మున్సిపాలిటీ నుంచి అందిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు ఎల్. వందన నగేష్, మీనాముత్యాలు, లక్ష్మీనారాయణ, ఎస్. శ్వేతాకిరణ్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, సిద్దప్ప, లక్ష్మీ, నాయకులు నరేష్, రవికాంత్‌రెడ్డి తదితరులున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో డీసీఎంలో మంటలు

శంషాబాద్: ప్రమాదవశాత్తు కుర్చీల లోడు లారీ దగ్ధమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సోమవారం హయత్‌నగర్‌కు చెందిన డీసీఎం గగన్‌పహాడ్‌లోని పారిశ్రామికవాడలో ఓ కంపెనీలోని కుర్చీలను లోడ్ చేశారు. జాతీయరహదారికి పైకి వచ్చిన డీసీఎంలోని క్యాబిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. కుర్చీలన్నింటికీ మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఫైరింజన్‌ను రప్పించి మంటలను ఆర్పివేయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టులో బైక్ చోరి

శంషాబాద్: దుండగులు బైక్‌ను ఎత్తుకెళ్లిన ఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేసే వడ్డె మహేష్ ఎయిర్‌పోర్టులోని ఔట్‌సైడ్ ఏరియా పార్కింగ్‌లో తన బైక్‌ను పార్క్ చేసి విధులు నిర్వహించి వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

శంషాబాద్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాళ్లగూడలో కొంత కాలంగా నివాసం ఉంటున్న విజయలక్ష్మి (24) స్థానికంగా ఉండే ప్లాస్టిక్ దుకాణంలో పనిచేసేది. కాగా ఆమె రెండు రోజుల క్రితం పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి ఆమె బంధువులు, కుటుంబసభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నాం'

గోల్కొండ: విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని గుడిమల్కాపూర్‌లోని న్యూ ఈడెన్ హైస్కూల్ కరెస్పాండెంట్ గాలయ్య అన్నారు. సోమవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గోల్కొండ జోన్ డిప్యూటీ ఈఓ బానోతు వెంకటేశ్వర్లు, ఆసిఫ్‌నగర్ మండల డిప్యూటీ ఐఓఎస్ అజేందర్‌రెడ్డి, సెయింటాన్స్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాధాకిరణ్, న్యూ హిడెన్ హైస్కూల్ డైరెక్టర్ శశిపాల్‌రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



చిన్నగోల్కొండలో ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండలో నిర్మించిన చెన్నకేశవ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి, పార్వతి, నవగ్రహ, జీవ ధ్వజస్తంభం, చెన్నకేశ్వర, ఆంజనేయ, సుబ్రమణ్య విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ గుర్రం పద్మావతి, సొసైటీ డైరెక్టర్, ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం అనంతరెడ్డి, అన్నదాతలు విక్రమ్‌రెడ్డి, యాదగిరి, ఉపసర్పంచ్ భిక్షపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన వార్డు సభ్యులు

శంషాబాద్ రూరల్: చౌదరిగూడ గ్రామ పంచాయతీలో అభివృద్ధి కుంటుపడిందని సర్పంచ్ తీరును నిరసిస్తూ పాలకవర్గం సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. సోమవారం పంచాయతీ సర్వసభ్య సమావేశానికి సర్పంచ్ రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ కళమ్మ, వార్డు సభ్యులు మహేష్, పొగాకు మహేశ్వరి, మామిళ్ల మల్లేష్, బక్క భారతమ్మ హాజరయ్యారు. సర్పంచ్ తీరుతోనే పంచాయతీలో గత నాలుగేళ్ల నుంచి అభివృద్ధి జరగడంలేదని ఆరోపిస్తూ సమావేశాన్ని ఉపసర్పంచ్, వార్డు సభ్యులు బహిష్కరించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. గతంలో గ్రామానికి సీసీ రోడ్డు ఏర్పాటు కోసం మండల పరిషత్ నుంచి రూ.3 లక్షలు మంజూరైతే పనులు చేయకుండా అడ్డుకోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయని దుయ్యబట్టారు.



సమావేశాన్ని బహిష్కరిస్తున్న ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

- రాజకీయ కక్ష సాధింపుతోనే తనపై ఆరోపణలు చేస్తూ.. పంచాయతీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నారని ఇది పద్ధతి కాదని సర్పంచ్ రాజ్‌కుమార్ హితవు పలికారు.

రూ. 9.80 కోట్లతో నాలా అభివృద్ధి పనులు

మణికొండ: పండెన్‌వాగు నాలాకు రిటర్నింగ్ వాల్ నిర్మాణం పూర్తి స్థాయిలో చేపడితే పంచవటి కాలనీ వాసుల ముంపు సమస్య పూర్తిగా తీరుతుందని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీకి చెందిన రూ.9.80 కోట్ల నిధులతో ఎస్ఎన్‌డీపీ శాఖ ఆధ్వర్యంలో త్వరలోనే పనులను చేపడతారని ఆయన పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, డీఈ దివ్యజ్యోతిలతో కలిసి నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పంచవటీ కాలనీ వాసులు వర్షం వచ్చిన ప్రతీసారి ముంపునకు గురవుతూ.. తీవ్ర సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. వచ్చే వర్షాకాలం లోపు పనులను పూర్తి చేసేలా అధికారులు, కాంట్రాక్టర్లు సరైన కార్యాచరణతో పనిచేయాలని సూచించారు. ఏఈ సాయిమౌనిక, కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి, కో-ఆప్షన్ సభ్యుడు సిద్దప్ప, ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సీతారాం, కోశాధికారి బాబురావు తదితరులున్నారు.



పంచవటి కాలనీలో నాలాను పరిశీలిస్తున్న అధికారులు

'రాష్ట్రంలో బీసీలకు తీరని అన్యాయం'



సమావేశంలో మాట్లాడుతున్న వసంత్‌కుమార్‌యాదవ్

శంషాబాద్ రూరల్: రాష్ట్రంలో బీసీ వర్గాన్ని ప్రభుత్వం అణగతొక్కిందని ఓబీసీ రాష్ట్ర నాయకులు వసంత్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. సోమవారం శంషాబాద్ మండలంలో 'పల్లెపల్లెకు ఓబీసీ-ఇంటింటికీ బీజేపీ' సన్నాహక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓబీసీ పటిష్టత కోసం రాష్ట్రంలో ఏప్రిల్ 6 నుంచి 14 వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీలకు అన్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా అందరూ ఉద్యమించాలన్నారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు లక్ష్మయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు భాస్కర్‌గౌడ్, క్యాతం శ్రీశైలం, నాయకులు వెంకటేష్, రవీందర్, శ్రీను శంకరప్ప, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

బీజేఆర్ జయంత్యుత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

రాజేంద్రనగర్: మహనీయుల ఆశయ సాధనకు యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు.




బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

- ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను ఆరాంఘర్ చౌరస్తాలోని బీజేఆర్ విగ్రహం వద్ద నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరాంఘర్ చౌరస్తాలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని పున ప్రతిష్ట అనంతరం తొలిసారిగా జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సర్కిల్ ఉప కమిషనర్ జగన్, కార్యనిర్వాహక ఇంజినీర్ నరేందర్‌గౌడ్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పలుగుచెరువు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, ఉపకోశాధికారి సూర్యం, ముఖ్య సలహాదారులు జీవన్‌దాస్, వనం నర్సింహ్మా, క్యాసారం శంకర్ రావు, నందిగామ నర్సింహ్మా, మంత్రి చంద్రశేఖర్, జోగి రవి, అనుముల జాన్ పాల్, రగడంపల్లి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి

- ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- అర్ధరాత్రి అభివృద్ధి పనుల తనిఖీలకు ఎమ్మెల్యే శ్రీకారం



సాయిభవ్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను అర్ధరాత్రి తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని సాయి వైభవ్ కాలనీలో రూ. 30 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ఆదివారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ఎంత వరకు పాటిస్తున్నారనే విషయాన్ని ఆయన స్వయంగా తనిఖీ చేసి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విపత్కర పరిస్థితుల్లో సంక్షేమం, అభివృద్ధి ఆగిపోకూడదనే ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయడంతోనే విరివిగా అభివృద్ధి పనులను మంజూరు చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతోనే శేరిలింగంపల్లికి భారీ ఎత్తున నిధులు మంజూరయ్యాన్నారు. శేరిలింగంపల్లిలో శేరిలింగంపల్లి చరిత్ర ఎన్నడూ లేని విధంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, థీమ్‌పార్కులు, అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడం, ప్రధానం రోడ్లను బీటీ రోడ్లుగా, పలు కొత్తగా లింకురోడ్ల నిర్మాణం, చెరువుల సుందరీకరణ, నాలాల విస్తరణ, వరద నీటి కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సమీక్షా సమావేశాల్లో అధికారులకు స్పష్టం చేశామని గుర్తు చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పరిశీలించడానికే అర్ధరాత్రి చేపట్టే పనులను ఆకస్మికంగా వెళ్లి తనిఖీలు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతికాలనీ, బస్తీల్లో మెరుగైన వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిధుల మంజూరును బట్టి దశలవారీగా అన్ని పనులను పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.